kalamdaily.com

# కలం
ప్రజల గళం...

Follow on: Kalamtelugu

ఆదివారం
29-03-2026

పేజీలు: 3

360° SINGLE TOPIC
లిక్కర్ బిజినెస్

# మద్యం ప్రియులకు
# వార్ షాక్



**పెరగనున్న లిక్కర్, బీర్ రేట్లు**

**బాటిళ్లు, మూతల తయారీపై ఇరాన్ యుద్ధం ఎఫెక్ట్**

**రేట్లను 15% పెంచాలంటూ బేవరేజెస్ కంపెనీల లేఖ**

**ఈసారి 'సమ్మర్ కిక్' కావాలంటే జేబులకు చిల్లు!**

ముందున్న కాలమంతా పీక్ సమ్మర్! మద్యం ప్రియులకు ఇరాన్ వార్‌తో షాక్ తగలనుంది. ఇప్పటికే భారీగా పెరిగిన లిక్కర్, బీర్ రేట్లు.. మరింత పెరిగేలా ఉన్నాయి. ఇరాన్ యుద్ధం కారణంగా అటు ప్లాస్టిక్ బాటిళ్లు, మూతలు, ప్యాకేజింగ్ మెటీరియల్ ధరలే కాకుండా బీర్ బాటిళ్ల ధరలూ పెరుగుతున్నాయి. తయారీ ఖర్చు భారంగా మారిందంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బేవరేజెస్ కంపెనీల సమాఖ్య లేఖలు రాసింది. కనీసంగా 15% మేర మద్యం రేట్లను పెంచుకునే వెసులుబాటు కల్పిస్తే తప్ప గట్టెక్కలేమని తేల్చి చెప్పాయి. ఇదే జరిగితే.. బ్రాందీ, విస్కీపై కనిష్ట స్థాయిలో 20 రూపాయలు, బీర్ పైన పది రూపాయలు పెరిగే అవకాశాలున్నాయి.

మద్యం అమ్మకాల్లో దేశంలోనే తెలంగాణ టాప్. రాష్ట్ర ఖజానాకు ఆదాయాన్ని సమకూర్చే వనరుల్లో ఎక్సైజ్ శాఖ ముందు వరుసలో ఉన్నది. రాష్ట్రంలో బీరుకు ఎప్పుడూ ఫుల్ డిమాండ్. ఎండాకాలంలో రెండు మూడింతలు ఎక్కువగానే బీర్ సేల్స్ ఉంటాయి. ప్రస్తుతం సమ్మర్ సీజన్‌లో మద్యం దుకాణాల్లో బీర్లకే భారీ గిరాకీ ఉంది. ఎండలు ఇంకా ముదిరితే సేల్స్ మరింత పెరుగుతాయి. అందుకే డిమాండ్‌కు తగినట్లుగా వైన్ షాప్స్ స్టాక్ పెంచుకుంటూ ఉంటాయి. గతేడాది రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో బీరుపై రూ. 20 పెంచింది. బ్రాందీ, విస్కీ పైనా అదే స్థాయిలో పెంచింది. ఇప్పుడు యుద్ధం ఎఫెక్ట్‌తో మరోసారి వాటి రేట్లు పెరిగే అవకాశాలున్నాయి. యుద్ధం, దాని ప్రభావం తెలిసి కొందరు మద్యం ప్రియులు ఇప్పుడే ముందుచూపుతో అదనంగా మందు కేసులను కొని నిల్వ చేసుకుంటున్నారు. కొన్ని వైన్ షాపులు సైతం దూరదృష్టితో 'నో స్టాక్' పేరుతో బ్లాక్ చేసి పెట్టుకుంటున్నట్లు వార్తలు గుప్పుమంటున్నాయి.

మద్యం రేట్లను పెంచాలని బేవరేజెస్ కంపెనీల సమాఖ్య కోరడం వెనుక కారణాలేంటి? రేట్లు పెంచకపోతే గిట్టుబాటు కాదన్న డిమాండ్‌కు ప్రభుత్వాలు ఓకే చెప్తాయా? లేదంటే కంపెనీలు ఉత్పత్తిని తగ్గించుకుంటాయా? అదే జరిగితే మార్కెట్‌లో లిక్కర్ షార్టేజీ తప్పదా? ఇరాన్ వార్ వడ్డిస్తున్న రేట్ల ప్రభావం లిక్కర్ మీద పడితే ఎంత మేర ఆ ధరలు పెరగొచ్చు..? అసలు లిక్కర్ తయారీకి అయ్యే ఖర్చు ఎంత? అది వినియోగదారుడి చేతిలోకి వచ్చే సరికి ఎంత పెరుగుతుంది?

వీటన్నింటిపై కలం 360 డిగ్రీస్ ప్రత్యేక కథనం..

- తెలంగాణ బ్యూరో, కలం



# యుద్ధ భారం ఎంత?

- పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా సప్లై చెయిన్ దెబ్బతిన్నది. దీంతో లిక్కర్ తయారీకి ఉపయోగించే ప్లాస్టిక్ బాటిళ్లు, క్యాప్స్, గాజు బాటిళ్ల తయారీకి అవసరమయ్యే ముడి పదార్థాల రేట్లు విపరీతంగా పెరిగాయి. ఫలితంగా మద్యం తయారీ ఖర్చూ పెరిగింది.
- సాధారణంగా బీర్, విస్కీ, బ్రాందీ, రమ్ లాంటి ఆల్కహాల్‌కు ఎక్కువగా గాజు బాటిళ్లను వాడతారు. కొన్నింటికి ప్లాస్టిక్ బాటిళ్లనూ వినియోగిస్తారు.
- ప్లాస్టిక్‌లో పాలీఎథిలిన్ టెరాప్తాలేట్ (పీఈటీ) బాటిళ్లను ఆల్కహాల్‌కు వినియోగిస్తారు. ఈ బాటిళ్ల తయారీకి ప్యూరిఫైడ్ టెరెప్తాలిక్ యాసిడ్ (పీటీఏ), మోనోఎథిలీన్ గ్లైకాల్ (ఎంఈజీ) అవసరం. అలాగే ప్లాస్టిక్ బాటిళ్ల క్యాప్స్ తయారీలో పాలీప్రొపైలీన్ (పీపీ), హై డెన్సిటీ పాలీ ఎథిలీన్ (హెచ్‌డీపీఈ) వాడతారు. ఇవన్నీ నాఫ్తా అనే మిశ్రమం నుంచి ఉత్పత్తి అవుతాయి.
- నాఫ్తా అనేది క్రూడాయిల్ డిస్టిలేషన్ ద్వారా వచ్చే ఒక మిశ్రమం. ఇప్పుడు క్రూడాయిల్ ధరలు పెరగడంతో నాఫ్తా రేట్లూ పెరిగి.. ఆ ప్రభావం మద్యం కంపెనీలపై పడుతున్నది. ఇరాన్ యుద్ధం ఎఫెక్ట్‌తో క్రూడాయిల్ రవాణాలో తీవ్ర ఆటంకాలు ఏర్పడుతున్నాయి.
- ఇప్పటికే పాలీప్రొపైలీన్ రేటు కిలోకు రూ.35 (36%), హెచ్‌డీపీఈ రేటు కిలోకు రూ.33 (31%) పెరిగింది. పీటీఏ, ఎంఈజీ రేట్లు కిలోకు రూ.34.50 (40%) చొప్పున పెరిగాయి. ఈ ముడి పదార్థాలన్నింటికీ మూలమైన క్రూడాయిల్ రేటు బ్యారెల్‌కు 100 డాలర్లను దాటిపోయింది.
- లిక్కర్‌కు ఎక్కువగా గాజు బాటిల్సే అవసరం. గాజు బాటిళ్ల పరిశ్రమల్లో ఎల్ఎన్‌జీ/ఎల్పీజీ కీలకం. ఇరాన్ వార్‌తో వీటి సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ధర పెరిగిపోయింది. గాజు బాటిళ్ల తయారీలో ముఖ్యమైన మరో ముడి పదార్థం సోడా యాష్. దీని ధర 15 శాతం పెరిగింది. దీంతో గాజు బాటిళ్ల ధరలూ 12 శాతం వరకు పెరిగిపోయాయి.
- గాజు బాటిళ్ల క్యాప్స్ తయారీకి వాడే అల్యూమినియం ధర కూడా 8 శాతం పెరిగింది.
- ప్యాకేజింగ్ కాస్ట్ కూడా పెరిగింది. మద్యం కాటన్లకు అవసరమైన వేస్ట్ పేపర్ యూఎస్, యూరప్ నుంచి రావాల్సి ఉంటుంది. దీని ధర కంటెయినర్‌కు రూ.1500 డాలర్ల (రూ.1.42 లక్షలు) దాకా పెరిగింది.



## మద్యం కంపెనీల డిమాండ్ ఇదీ..

మద్యంపైనా ఇరాన్ యుద్ధ ప్రభావం పడింది. లిక్కర్ తయారీకి అవసరమయ్యే 'రా' మెటీరియల్ ధర భారీగా పెరిగిపోయింది. దీంతో బీర్, వీస్కీ, బ్రాందీ, ఇతర మద్యం ధరలు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వాలను, కేంద్ర ప్రభుత్వాన్ని ఆల్కహాల్ తయారీ కంపెనీలు కోరాయి.

- భారత్‌లో మద్యం రంగంలో కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఆల్కహాలిక్ బేవరేజ్ కంపెనీస్ (సీఐఏబీసీ) అతిపెద్ద సంస్థ. ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్ (ఐఎంఎఫ్ఎల్) ఉత్పత్తుల ధరలను 15% పెంచాలని ప్రభుత్వాలకు ఈ సంస్థ లేఖ రాసింది. ఒక కేసుపై (12 ఫుల్ బాటిల్స్) రూ.100 నుంచి 150 రేటు పెంచాలని కోరింది. ప్రొడక్టును బట్టి ధర పెంపును నిర్ణయించాలని విజ్ఞప్తి చేసింది.
- ధరలు పెంచాలని బీర్ల కంపెనీల అసోసియేషన్ కూడా సెపరేట్‌గా రాష్ట్ర ప్రభుత్వాలను కోరింది. ఈ మేరకు బ్రూవర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బీఏఐ) రాష్ట్రాలకు లేఖ రాసింది. ఒక్కో బీర్ కేసుపై (12 బాటిళ్లు) రూ.25 నుంచి 30 పెంచాలని విజ్ఞప్తి చేసింది.

## మద్యం సేల్స్‌లో తెలంగాణ టాప్

రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్య రెవెన్యూ ఆదాయాల్లో ఎక్సైజ్ ఇన్ కమ్ ఒకటి. దేశంలోనే మద్యం అమ్మకాల్లో తెలంగాణ టాప్‌లో ఉంది. రాష్ట్రంలో మద్యం అమ్మకాలు ఏటేటా కొత్త రికార్డులను క్రియేట్ చేస్తున్నాయి. ఏటా హార్డ్ లిక్కర్ సుమారు 3.7 కోట్ల కేసులు, బీర్ సుమారు 5.3 కోట్ల కేసులు (1 కేసులో 12 బాటిళ్లు) సేల్ అవుతున్నాయి. ఇందులో బీర్ ప్రధాన భాగం సుమారు 60% కాగా.. లిక్కర్ 40% వరకు ఉంది. పండుగలు, స్పెషల్ అకేషన్స్ , సీజన్స్, ధరల పెరుగుదల వంటి కారణాలతో విక్రయాల్లో కొంత మార్పు జరుగుతుంది.

## రోజుకు 2 లక్షల కేసుల బీర్లు!

సాధారణంగా మద్యం అమ్మకాల్లో బీర్ల వాటానే ఎక్కువ. సమ్మర్‌లో బీర్ల వినియోగం అధికం. నెలకు సగటున 45–55 లక్షల కేసుల బీర్లు, 30–35 లక్షల కేసుల లిక్కర్ అమ్ముడవుతాయి. విలువ పరంగా (డబ్బు రూపంలో) చూస్తే లిక్కర్ వాటా ఎక్కువ. ఎండలు తీవ్రంగా ఉండే ఏప్రిల్, మే నెలల్లో రోజుకు సగటున 2 లక్షల నుంచి 2.5 లక్షల కేసుల బీర్లు సేల్ అవుతాయి. రాష్ట్రవ్యాప్తంగా బీర్ల అమ్మకాల్లో హైదరాబాద్, దాని చుట్టుపక్కల ప్రాంతాలైన మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలది 50% వాటా. 2025 ఫిబ్రవరితో పోలిస్తే ఈసారి ఫిబ్రవరిలో తెలంగాణలో బీర్ అమ్మకాల్లో 36 శాతం పెరుగుదల కనిపించింది.

## అమ్మకాలు ఇలా...

| | 2025 | 2026 |
|---|---|---|
| జనవరి | 31 లక్షలు | 34 లక్షలు |
| ఫిబ్రవరి | 28 లక్షలు | 38 లక్షలు |

## రేట్లు ఎంత పెరగొచ్చు?

- ఐఎంఎఫ్ఎల్ మద్యం కేసు (12 ఫుల్ బాటిల్స్)పై రూ.100 నుంచి రూ.150 పెంచాలని కంపెనీలు కోరుతున్నాయి. అంటే ఒక్కో బాటిల్‌పై రూ.12 వరకు పెరగవచ్చు. దీనికి ప్రభుత్వ పన్నులు తోడైతే.. ఫుల్ బాటిల్‌కు రూ.20 చొప్పున పెరిగే చాన్స్ ఉంది.
- బీర్ కేసు (12 బాటిళ్లు)పై రూ.25 నుంచి 30 పెంచాలని కంపెనీలు కోరుతున్నాయి. అంటే ఒక్కో బీర్‌పై రూ.3 పెరగొచ్చు. దీనికి ప్రభుత్వ పన్నులు తోడైతే.. ఒక్కో బీర్‌పై రూ.10 చొప్పున పెరిగే చాన్స్ ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

### మద్యం ప్రస్తుతం, పెరిగే ధరలు ఇలా (మార్కెట్ వర్గాల అంచనా)..

బీర్ల రేట్లు.. (రూపాయల్లో)

| బీర్ | ప్రస్తుతం | పెరిగితే |
|---|---|---|
| కేఎఫ్ లైట్ | 180 | 190 |
| కేఎఫ్ స్ట్రాంగ్ | 190 | 200 |
| ఆర్సీ | 180 | 190 |
| టుబర్గ్ లైట్ | 180 | 190 |
| హైవర్డ్స్ | 190 | 200 |
| బడ్‌వైజర్ | 250 | 260 |
| కార్ల్స్‌బర్గ్ | 230 | 240 |

ఐఎంఎఫ్ఎల్ రేట్లు (ఫుల్ బాటిల్‌కు)..

| బ్రాండ్ | ప్రస్తుతం | పెరిగితే |
|---|---|---|
| రాయల్ స్టాగ్ | 880 | 900 |
| రాయల్ గ్రీన్ | 880 | 900 |
| బీ7 | 880 | 900 |
| సిగ్నేచర్ | 1,360 | 1,380 |
| బ్లెండర్స్ ప్రైడ్ | 1,360 | 1,380 |
| యాంటీక్విటీ | 1,450 | 1,470 |
| 100 పైపర్స్ | 2,160 | 2,180 |



## సమ్మర్‌లో షాక్ తప్పదా!

సాధారణంగా సమ్మర్‌లో బీర్ సేల్స్ ఎక్కువగా ఉంటాయి. ఉక్కిరిబిక్కిరి చేసే ఎండల టైమ్‌లో మద్యం ప్రియులు చల్లని బీర్‌కే జై కొడుతుంటారు. ఈసారి మార్చి నెలలోనే ఎండలు దంచుతున్నాయి. ఇప్పటికే బీర్లకు ఫుల్ డిమాండ్ ఉంది. రానున్న రోజుల్లో మరింత పెరగనుంది. కానీ ఒకవేళ బీర్, లిక్కర్ రేట్లు పెరిగితే.. మద్యం ప్రియులకు సమ్మర్ షాక్ తప్పదు!

## ఏడాదికి ఒక్కొక్కరు రూ. 1,623 ఖర్చు

దేశంలో మద్యం విక్రయాల్లో తెలంగాణ, ఏపీ రాష్ట్రాలు మొదటి, రెండో స్థానాల్లో నిలిచాయి. ఢిల్లీలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ పాలసీ (ఎన్ఐపీఎఫ్ పీ) 2024లో చేపట్టిన సర్వేలో తెలంగాణలో 2023లో అత్యధిక మద్యం అమ్మకాలు జరిగాయి. రాష్ట్రంలో మద్యం కోసం సగటున ఏడాదికి ఒక వ్యక్తి రూ.1,623 ఖర్చు చేస్తున్నట్లు ఎన్ఐపీఎఫ్‌పీ తేల్చింది. ఏపీలో మద్యం కోసం ఒక వ్యక్తి సగటున రూ.1,306 ఖర్చు చేస్తున్నట్లు లెక్కకట్టింది. పంజాబ్‌లో రూ.1,245, చత్తీస్‌గఢ్‌లో రూ.1,227 ఖర్చు చేసినట్లు ఎన్ఐపీఎఫ్‌పీ సర్వే పేర్కొంది.

## సర్కార్‌కు రూ.36 వేల కోట్ల రాబడి

రాష్ట్రానికి మద్యం అమ్మకాల్లో ఆదాయ పరంగా చూస్తే.. 2024–25లో సుమారు రూ. 34,600 కోట్లు వచ్చాయి. ఇది 2025–26లో ఈ మార్కును దాటనుంది. గత ఫిబ్రవరి నాటికే ఎక్సైజ్ ఆదాయం రూ. 35,959 కోట్లకు చేరింది. గతేడాది ఫిబ్రవరి, మేలో పెరిగిన బీర్, లిక్కర్ రేట్లతో ప్రభుత్వ ఖజానాకు రాబడి మరింత పెరిగింది. తెలంగాణకు వచ్చే సొంత పన్ను ఆదాయంలో దాదాపు 20 శాతం వరకు అబ్కారీ నుంచే సమకూరుతున్నది.



## ఎక్సైజ్ శాఖ టార్గెట్ ఎంతంటే?

రాష్ట్ర ప్రభుత్వం తన ఆదాయాన్ని పెంచుకోవడానికి ఎక్సైజ్ అమ్మకాల ద్వారా భారీ లక్ష్యాలను నిర్దేశించుకుంటున్నది. తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి ఇది ఏటా పెరుగుతున్నది. వచ్చే 2026-27 ఆర్థిక సంవత్సరానికి ఎక్సైజ్ శాఖ ద్వారా రూ. 46,941 కోట్ల ఆదాయాన్ని సాధించాలని తాజా బడ్జెట్‌లో లక్ష్యంగా పెట్టుకున్నది. ఇది గత ఏడాది కంటే దాదాపు రూ.10,000 కోట్లు ఎక్కువ. 2014–15లో నిర్దేశించుకున్న లక్ష్యం రూ.10,500 కోట్లు ఉండగా.. కేసీఆర్ రెండోసారి అధికారంలోకి వచ్చేనాటికి (2018–19) అది రూ.19,500 కోట్లకు ఎగబాకింది. ఆ తర్వాత 2020–21కి రూ.25వేల కోట్ల మార్క్‌కు చేరుకుంది. కరోనా ఉన్నా ఆ టార్గెట్ ను ప్రభుత్వం రీచ్ కావడమే కాకుండా అదనంగా 2 వేల కోట్లు రాబట్టింది. కేసీఆర్ ప్రభుత్వం దిగిపోయే నాటికి (2023–24) ఆర్థిక సంవత్సరంలో ఎక్సైజ్ రాబడి లక్ష్యం రూ. 34వేల కోట్లు. తెలంగాణ వచ్చినప్పటి నుంచి ఇప్పటితో పోలిస్తే.. ఎక్సైజ్ టార్గెట్, ఆదాయం దాదాపు నాలుగు రెట్లు పెరిగింది.

## తయారీ ఖర్చు చారాణా.. ప్రభుత్వానికి బారాణా

వైన్స్‌లో కొనే ఒక బీర్ బాటిల్ (650 మిల్లీలీటర్లు) ధర రూ. 180 అయితే.. దాని తయారీకి అయ్యే ఖర్చు ఎంతో తెలుసా? అందులో ప్రభుత్వ ఖజానాకు వెళ్లేది ఎంతో తెలుసా? ఆ లెక్కలు తెలుసుకుంటే షాక్ కావాల్సిందే. ఎక్సైజ్ డ్యూటీ, వ్యాట్, స్పెషల్ ఎక్సైజ్ సెస్.. వంటి పన్నులు ప్రభుత్వానికి చేరుతాయి. రిటైలర్లకు మార్జిన్ ఉంటుంది. అంటే.. ఈ పన్నులు, మార్జిన్లు తీసేస్తే ఒక్క బీరు బాటిల్ అయినా, ఫుల్ బాటిల్ బ్రాందీ అయినా, విస్కీ అయినా తయారయ్యేది చారాణాకు అనుకుంటే.. వినియోగదారుడి చేతికి అందేది రూపాయికి.. అందులో ప్రభుత్వానికి వెళ్లేది బారాణా!

- ఒక బాటిల్ మద్యం తయారీదారు నుంచి వినియోగదారుడికి చేరే లోపు 4 రకాల ప్రధాన పన్నులు పడతాయి.

*ఎక్సైజ్ డ్యూటీ:* 160% నుంచి 240% వరకు (బేసిక్ ధర మీద).
*వ్యాట్:* 70%
*రిటైలర్ మార్జిన్:* దుకాణదారుడికి ఇచ్చే లాభం 20% నుంచి 27%.
*స్పెషల్ ఎక్సైజ్ సెస్:* బాటిల్‌ను బట్టి రూ. 10 నుంచి 30 వరకు ఉంటుంది.

### బీర్ తయారీకి అయ్యేది రూ. 28లోపే

వైన్ షాప్‌లో ప్రస్తుతం కేఎఫ్ లైట్స్ బీర్ రూ.180 వరకు ఉంది. అదే కేస్ (12) తీసుకుంటే అది రూ. 2,160 అవుతుంది. ఒక కేస్ బీర్ల తయారీకి అయ్యే ఖర్చు కేవలం రూ. 333.60. అంటే ఒక్క బాటిల్ బీర్ తయారీకి అయ్యేది 27 రూపాయల 70 పైసలు మాత్రమే. మిగతా దాదాపు 153 రూపాయల వరకు ఎక్సైజ్ డ్యూటీ, వ్యాట్, స్పెషల్ ఎక్సయిజ్ సెస్‌కు, రిటైలర్ మార్జిన్‌కు పోతాయి.

## పుష్కర కాలంలో లిక్కర్, బీర్ సేల్స్ ఇలా..

తెలంగాణ ఏర్పడిన 2014 నుంచి ఇప్పటి వరకు మద్యం అమ్మకాలు, వచ్చే ఆదాయం భారీగా పెరిగాయి. గత పదేళ్లలో రాష్ట్ర ఎక్సైజ్ ఆదాయం సుమారు 400% పైగా వృద్ధి చెందింది. రాష్ట్ర మొత్తం ఆదాయంలో ఎక్సైజ్ శాఖ వాటా అత్యంత కీలకంగా మారింది. తెలంగాణలో మద్యం ఆదాయం ప్రతి సంవత్సరం పెరుగుతూనే ఉంది. 2014లో రూ.10 వేల కోట్లకు పైగా ఉంటే.. ప్రస్తుతం రూ.40 వేల కోట్లకు పైగా చేరుకోవడమే ఇందుకు నిదర్శనం. 2020–21లో లాక్‌డౌన్ ఉన్నప్పటికీ మద్యం అమ్మకాలు జోరుగా సాగాయి. 2025 డిసెంబర్ లో తెలంగాణలో మద్యం అమ్మకాల చరిత్రలోనే తొలిసారిగా ఒకే నెలలో రూ.5 వేల కోట్లకుపైగా ఆదాయం వచ్చింది. ఇది 2023 డిసెంబర్‌లో రూ. 4 వేల కోట్లకుపైగా ఉండేది. గత 12 ఏళ్లలో సంవత్సరాల వారీగా అమ్ముడైన మద్యం, వచ్చిన ఆదాయం ఇలా ఉంది.

| ఆర్థిక సంవత్సరం | లిక్కర్ (లక్షల కేసులు) | బీర్ (లక్షల కేసులు) | మొత్తం ఆదాయం (రూ. కోట్లు) |
|---|---|---|---|
| 2014–15 (జూన్ నుంచి) | 180.5 | 220.2 | 10,833 |
| 2015–16 | 200.1 | 235.4 | 12,706 |
| 2016–17 | 215.8 | 265.9 | 14,184 |
| 2017–18 | 230.4 | 310.2 | 17,594 |
| 2018–19 | 255.6 | 350.1 | 20,859 |
| 2019–20 | 280.4 | 410.8 | 23,145 |
| 2020–21 | 290.2 | 270.5 | 27,288 |
| 2021–22 | 320.4 | 335.8 | 30,783 |
| 2022–23 | 355.2 | 480.6 | 35,145 |
| 2023–24 | 362.0 | 548.0 | 36,493 |
| 2024–25 | 369.0 | 531.0 | 34,600 |
| 2025–26 (అంచనా) | 380.0 | 560.0 | 38,000 – 40,000 |

## దేశంలో మద్యం అమ్మకాలు ఏటా రూ. 6 లక్షల కోట్లు

దేశీయ మద్యం మార్కెట్ విలువ సుమారు 2014లో రూ. 1.5 లక్షల కోట్లుగా ఉంటే, అది 2026 నాటికి రూ. 5.3 లక్షల కోట్లకుపైగా పెరిగింది. దేశవ్యాప్తంగా ఏటా సుమారు 100 కోట్ల కేసులకుపైగా (లిక్కర్, బీర్, దేశీదారు కలిపి) మద్యం అమ్మకాలు. ప్రధానంగా ఐఎంఎఫ్ఎల్ ( ఇండియన్ మేడ్ ఫారెన్ లిక్కర్ – విస్కీ, బ్రాందీ, రమ్ వంటివి), బీర్ అమ్మకాలు ఎక్కువ. రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన ఆదాయ వనరుల్లో మద్యం పన్నులు (ఎక్సైజ్ డ్యూటీ & వ్యాట్) కీలకమైనవి. 2025-26 అంచనా ప్రకారం.. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల అబ్కారీ ఆదాయం సుమారు రూ. 5.3 లక్షల కోట్లకు చేరుకునే చాన్స్. గత మూడేళ్లుగా మద్యం ఆదాయంలో ఏటా 10% నుంచి 13% వృద్ధి నమోదు. దేశవ్యాప్తంగా సమ్మర్‌లో బీర్ల కొరత ఏర్పడేంత స్థాయిలో అమ్మకాలు. ముఖ్యంగా యూత్ , పట్టణ ప్రాంతాల్లో బీర్ విక్రయ వాటా పెరుగుతోంది. దేశంలో ఏటా సుమారు 1.5 కోట్ల నుంచి 2 కోట్ల మంది యువత మద్యం తాగే చట్టబద్ధమైన వయసులోకి ప్రవేశిస్తుండడం.. అమ్మకాలు పెరగడానికి ప్రధాన కారణం. ప్రపంచంలోనే భారత్ అతిపెద్ద విస్కీ మార్కెట్. ఖరీదైన మద్యం బ్రాండ్ల వినియోగం వేగంగా పెరుగుతోంది. ఏటేటా ప్రీమియం స్పిరిట్స్ అమ్మకాల్లో 15–20% వృద్ధి.

## వ్యాట్ ద్వారానే 18వేల కోట్లు!

రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే ఆదాయంలో రెవెన్యూ, ఎక్సైజ్ శాఖలది టాప్ ప్లేస్. మద్యం అమ్మకాలతో భారీగా రాబడి వస్తున్నది. తయారీకి అయ్యే ఖర్చు.. వినియోగదారుడికి చేరే ప్రొడక్ట్ ధరతో పోలిస్తే.. అందులో దాదాపు 300 శాతం సొమ్ము ప్రభుత్వ ఖజానాకు చేరుతుంది. వాటిలోనూ వ్యాట్ ద్వారా సమకూరేదే ఎక్కువ. తెలంగాణ ఏర్పడినప్పుడు 2014-15లో ఎక్సైజ్ వ్యాట్ ద్వారా వచ్చింది రూ. 6,633 కోట్లు అయితే.. ఇప్పుడు 18వేల కోట్లు దాటింది.

| ఆర్థిక సంవత్సరం | రాష్ట్ర ఎక్సైజ్ డ్యూటీ (రూ.కోట్లలో) | వ్యాట్ (రూ. కోట్లలో) | మొత్తం ఆదాయం (రూ. కోట్లలో) |
|---|---|---|---|
| 2014 –15 (జూన్ – మార్చి) | 4,200 | 6,633 | 10,833 |
| 2015 – 16 | 4,850 | 7,856 | 12,706 |
| 2016 – 17 | 5,420 | 8,764 | 14,184 |
| 2017 – 18 | 7,650 | 9,944 | 17,594 |
| 2018 – 19 | 9,560 | 11,299 | 20,859 |
| 2019 – 20 | 10,800 | 12,345 | 23,145 |
| 2020 – 21 | 12,450 | 14,838 | 27,288 |
| 2021 – 22 | 14,320 | 16,463 | 30,783 |
| 2022 – 23 | 17,450 | 17,695 | 35,145 |
| 2023 – 24 | 18,200 | 18,293 | 36,493 |
| 2024 – 25 | 16,432 | 18,168 | 34,600 |

